
ప్రజాశక్తి

గురువారం 30 మే 2024 5

పార్వతీపురం మన్యం



హెచ్ఎంకు దేవానంద్‌కు బంగారు నంది

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

ప్రముఖ సినీ దర్శకులు ఎస్వీ కృష్ణారెడ్డి చేతుల మీదుగా హైదరాబాద్ రవీంద్ర భారతిలో కవి, రచయిత, మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పాలక దేవానంద్ బంగారు నంది పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతానికి చెందిన దేవానంద్ రచనల పట్ల ప్రతిభ చూపడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో తిరుపతి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ పద్మశ్రీ కొలకలూరి ఐనాక్ , సినీ నిర్మాత, దర్శకులు అచ్చిరెడ్డి, మా మూవీ సభ్యులు, సినీ నటులు, దర్శకులు జై హింద్ కుమార్, సినీ నటులు మానిక్ , గాలిపట్ల సుధాకర్, హుస్సేన్, సినీ నటులు, ఇందిర ఆర్ట్స్ ఫౌండర్, ఇందిరా పాల్గొన్నట్లు తెలిపారు.



బోసిపోయిన పార్వతీపురం ప్రధాన రహదారి

45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

సాలూరు: గత మూడు రోజులుగా సూరీడి ప్రతాపానికి మాడు పగిలేట్టుంది. బయటికి వెళ్తే తిరిగి ఇంటికి చేరతామో లేదోనన్న భయం వెంటాడుతోంది. మంగళవారం పట్టణంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవ్వగా, బుధవారం 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో జనం ఉదయం పది గంటల తర్వాత రోడ్డు మీదకు రావడానికి బెంబేలెత్తి పోతున్నారు. మధ్యాహ్నం పూట పట్టణంలోని ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది. బయటికి రాలేక ఇళ్లల్లో వుండలేక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇంకెన్నాళ్ళీ ఎండలు బాబోయ్ అని ఆవేదన చెందుతున్నారు.

భానుడు భగభగ

వేసవితాపంతో అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - కురుపాం

మన్యంలో భానుడు మళ్లీ భగభగలాడుతున్నాడు. బుధవారం మన్యంలో అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మే నెలాఖరులో వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. వారం రోజులు క్రితం చిన్న చిన్న వర్షాలు పడి ప్రజలకు కొంత ఉపసమనం కలిగినప్పటికీ మే నెలాఖరులో భగభగలాడుతూ సూర్యుడు తన ప్రతాపాన్ని పెంచేశాడు. గత రెండు రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మన్యం జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది 42 డిగ్రీలకు చేరుకుంది. అలాగే కురుపాం నియోజకవర్గం పరిధిలోని గుమ్మలక్ష్మీపురం, జియ్యమ్మవలస 40 డిగ్రీలు నమోదు కాగా, గిరిజన గ్రామాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండధాటికి తట్టుకోలేక మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనులు మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గ కేంద్రమైన కురుపాంలో మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి.

ఎక్కువ ప్రమాదం ఎవరికంటే

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు

ప్రజలు బయటకు తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకు నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తర్వాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రావాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు.

పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రంలో గత నాలుగు రోజులుగా భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఒకపక్క ఎండ వేడి మరొక ఉక్క పోతతో జిల్లా కేంద్రంలోని ప్రజలు అల్లాడుతున్నారు. బుధవారం కూడా ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవ్వడంతో ఎండ వేడిమి అధికంగా ఉండడంతో పట్టణ ప్రజలు నివాస గృహాల నుంచి బయటకు వచ్చేందుకు ఏమాత్రం ఆసక్తి చూపించకపోవడంతో పట్టణ ప్రధాన రహదారులన్నీ కర్ఫ్యూను తలపిస్తూ వెలవెలబోయాయి. దీంతో ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న వ్యాపారాలు మూసివేసి ఇళ్ల వద్దకే పరిమితమయ్యారు. దీంతో ఫుట్ పాత్ వ్యాపారులు తమ వ్యాపారాలకు గిరాకీ లేకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఇంకెన్ని రోజులు ఇలాంటి పరిస్థితి ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

అక్కడో రూలు, ఇక్కడో రూలా?

- పక్క జిల్లాలో సెక్టార్ అధికారులకు రూ.15వేలు
- ఇక్కడ రూ.ఐదు వేలిస్తామని బేరాలు
- ఆర్ఒకు ఫిర్యాదు చేసిన వీడియోగ్రాఫర్లు
- జిల్లా కలెక్టర్ ప్రొసీడింగ్స్ జారీలో జాప్యమెందుకో?

ప్రజాశక్తి - సాలూరు

రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు. అలాగే ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు కలిసి పని చేస్తేనే ఎన్నికలు విజయవంతమవుతాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మరో నాలుగు రోజుల్లో ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుంది. లెక్కింపు కోసం అధికారులు, సిబ్బందికి శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఈనెల 13న పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రక్రియలో భాగంగా విధులు నిర్వహించిన అధికారులకు, పిఒ, ఎపిఒ, ఒపిఒ, సిబ్బందికి కొంతమందికి అదేరోజు డబ్బులు చెల్లించారు. అయితే నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన సెక్టార్ అధికారులు, వివిధ టీముల్లో సభ్యులకు ఇంతవరకు చెల్లింపు జరగలేదు. సాలూరు నియోజకవర్గంలో 32 సెక్టార్ అధికారులకు చెల్లింపు చేయాల్సి ఉంది. పక్కనున్న విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో సెక్టార్ అధికారులకు రూ.15వేలు చొప్పున చెల్లించారు. ఎవరికి ఎంత చెల్లించాలన్న దానిపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. దాని ప్రకారం ఆ నియోజకవర్గాల్లో చెల్లింపులు జరిగిపోయాయి. ఫ్లైయింగ్ స్క్వాడ్, ఎస్ఎస్‌టి, వివిటి, ఎంసిసి, వివిటి బృందాల లీడర్లకు రూ.10వేలు, సభ్యులకు రూ.8వేలు చొప్పున చెల్లించాలని, పక్క జిల్లా కలెక్టర్లు ప్రొసీడింగ్స్ జారీ చేశారు. కానీ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ మాత్రం ఇంతవరకు ప్రొసీడింగ్స్ జారీ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రొసీడింగ్స్ జారీ చేయకపోవడం వల్లనే స్థానిక నియోజకవర్గ ఎఇఆర్ఒ, తహశీల్దార్ సింహాచలం ఇంతవరకు చెల్లింపు చేయడం లేదనే విమర్శలున్నాయి. పొరుగు జిల్లాలో సెక్టార్ అధికారులకు రూ.15వేలు చెల్లిస్తే ఇక్కడ మాత్రం రూ.5వేలు ఇస్తానని తహశీల్దార్ సింహాచలం చెప్పడంతో వారు డబ్బులు తీసుకోలేదు. పోలింగ్ ముగిసి 15రోజులైనా ఇంతవరకు చెల్లించక పోవడంపై సెక్టార్ అధికారులు, వివిధ టీముల్లో పని చేసిన వీడియో గ్రాఫర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పక్క జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించిన వారికి ఒక రూలు, మన్యం జిల్లాలో పని చేసిన వారికి మరో రూలా అని సెక్టార్ అధికారులు,ఇతర సిబ్బంది ప్రశ్నిస్తున్నారు.

ఆర్ఒకు వీడియో గ్రాఫర్లు ఫిర్యాదు

నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్‌కు బుధవారం ఎన్నికల టీముల్లో పని చేసిన వీడియో గ్రాఫర్లు ఫిర్యాదు చేశారు. నిబంధనల ప్రకారం తమకు చెల్లించాల్సిన డబ్బులు తహశీల్దార్ సింహాచలం చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క జిల్లాలో వీడియోగ్రాఫర్లకు రోజుకు రూ.2500 నుంచి రూ.3వేలు చొప్పున చెల్లించారని, ఇక్కడ మాత్రం దానిలో సగం కూడా ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు. తాను ముగ్గురు వీడియో గ్రాఫర్లను పెట్టి 80రోజులు పని చేశానని, తనకు అడ్వాన్స్ రూపంలో రూ.50వేలు మాత్రమే చెల్లించారని మెంటాడ మండల వీడియో గ్రాఫర్ యుబివి రాజు చెప్పారు. తనకు ఇంకా రూ.లక్షా 50వేలు చెల్లించాల్సి వుందని చెప్పారు. మెంటాడ, పాచిపెంట వీడియో గ్రాఫర్ షేక్ అబ్దుల్ బాజీ, మక్కువ మండల వీడియో గ్రాఫర్లు ఆర్ఒ విష్ణు చరణ్‌కు ఫిర్యాదు చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

ఆర్ఒ మౌనమెందుకో?

ఎన్నికల నిర్వహణకు సంబంధించి నియోజకవర్గానికి ఆర్ఒ సుప్రీం అధికారి అయినా స్థానిక నియోజకవర్గ ఆర్ఒ విష్ణు చరణ్ మౌనం వహించడం చర్చ నీయాంశమవుతోంది. తహశీల్దార్ సింహాచలం పని తీరుపై ఆయన గతంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు ఎన్నికల విధులు నిర్వహించిన వారికి చెల్లింపుల్లోనూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజాయితీగా పని చేస్తున్న ఐఎఎస్ అధికారిగా విష్ణు చరణ్‌కు గుర్తింపు ఉంది. అయితే మండల తహశీల్దార్ సింహాచలం వ్యవహారంలో ఆయన మౌనం వహించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. లిఖిత పూర్వక ఫిర్యాదు అందిన తర్వాతైనా చర్యలు తీసుకుంటారా లేదా అనేది అంతుచిక్కడం లేదు.

కుక్కల దాడిలో మృతుల కుటుంబాలకు

రూ.25 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

జియ్యమ్మవలస మండలం బిత్తర పాడు, వెంకటరాజపురం గ్రామాల్లో కుక్కల దాడిలో చనిపోయిన నీరస శంకర్రావు, బంటు లక్ష్మీమ్మ కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరి హారం ఇవ్వాలని, అలాగే కుక్కల దాడిలో గాయ పడిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు ఇవ్వాలని, ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్‌కు వినతిని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జియ్యమ్మవలస మండలం బిత్తరపాడు, వెంకటరాజపురం, పెదమేరంగి, కన్నపు దొరవలస, బాసంగి, గవరంపేట పంచాయితీల్లో గత రెండు నెలలుగా కుక్కలు మనుషులను కరుస్తున్నాయని, ఒంటరిగా వెళ్తున్న వారిపై దాడి చేసి చంపేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులోభాగంగానే ఈనెల 27న బిత్తరపాడుకు నీరస శంకర్రావు అనే పేద రైతు బహిర్భూమికి వెళ్లిన సమయంలో ఆయనున్న ఐదు కుక్కలు దాడి చేసి కాళ్లు, తోడలు, తల, చెవులు కొరికి తిని చంపే ప్రయత్నం చేశాయన్నారు. ఇది గమనించి వెంటనే గ్రామస్తులు చినమేరంగి కమ్యూనిటీ హెల్త్ సెంటరుకు తీసుకువెళ్లగా హాస్పిటల్‌కి వెళ్ళిన తర్వాత చనిపోయాడని డాక్టర్లు చెప్పారన్నారు. సదరు డాక్టర్ చనిపోయిన శంకర్రావు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించకుండా ఇంటికి పంపించివేశారన్నారు. అలాగే వెంకటరాజపురానికి చెందిన బంటు లక్ష్మమ్మను కుక్కలు మొదట దాడి చేసి చంపివేశా యన్నారు. అలాగే ఈ పంచాయతీల్లో సుమారు 50 మంది వరకు కుక్కల దాడిలో తీవ్రంగా గాయపడ్డారన్నారు. కావున కలెక్టర్ స్పందించి కుక్కల దాడిలో చనిపోయిన వారి కుటుంబాలకు, అలాగే దాడికి గురై తీవ్రంగా గాయపడి అనారోగ్యం బారినపడిన వారిని, కుక్కలు దాడిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపించి చనిపోయిన ఇద్దరికీ ప్రభుత్వం తరపున ఒక్కొక్క కుటుంబానికి రూ.25లక్షలు చొప్పున నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. అలాగే కుక్కల దాడిలో గాయపడిన వారికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.25 వేలు చొప్పున ఇప్పించా లని కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సిపిఎం నాయకులు కొల్లి గంగనాయుడు, బంటు దాసు, బిత్తరపాడు సర్పంచ్ జి.శ్రీనివాసరావు, డి.గుంప స్వామి, బి.గౌరునాయుడు, ఇ.శివ తదితరులు ఉన్నారు.

కలెక్టర్‌కు సిపిఎం నాయకుల వినతి



కలెక్టరేట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, నాయకులు

ముగిసిన కౌంటింగ్ అధికారుల శిక్షణ

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన కౌంటింగ్‌కు సంబంధించి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ సూపర్వైజర్లు కౌంటింగ్ అసిస్టెంట్లకు స్థానిక జూనియర్ కళాశాల, ఆర్డీవో కార్యాలయంలో రెండు రోజుల శిక్షణ బుధవారం ముగిసింది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు విష్ణుచరణ్, శుభం బన్సల్, హేమలత, వివి రమణ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్ బాలకృష్ణ కౌంటింగ్‌కు సంబంధించి ఇటిపిబిఎస్, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, కంట్రోల్ యూనిట్లలోని ఓట్ల కౌంటింగ్, వివిపాట్ స్లిప్పులు కౌంటింగ్ విధి విధానాలను వివరించి కౌంటింగ్ సిబ్బంది నిష్పాక్షికంగా, పారదర్శకంగా వ్యవహరించాలని తెలిపారు.



శిక్షణలో పాల్గొన్న ఆర్ఒలు వెంకటరమణ, హేమలత

పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం కింది పాయింట్లను ఖచ్చితంగా అనుసరించాల్సిన నిబంధనలు

- రిటర్నింగ్ అధికారికి సకాలంలో అందిన పోస్టల్ బ్యాలెట్ పేపర్లను కలిగి ఉన్న కవర్ 13-సిలన్నింటిని ఒకదాని తర్వాత ఒకటి తెరవాలి.
- ఫారమ్ 13-సి ఔటర్ కవర్‌ను తెరిచినప్పుడు, లోపల రెండు డాక్యుమెంట్‌లు ఉండాలి. మొదటిది - ఫారం 13-సిలో ఓటరు డిక్లరేషన్, రెండోది పోస్టల్ బ్యాలెట్ పేపర్‌ను కలిగి ఉన్న లోపలి "కవర్ ఎ(ఫారం 13-సి).
- పోస్టల్ బ్యాలెట్ పేపర్‌తో కూడిన కవర్ ఎను తెరవడానికి ముందు, రిటర్నింగ్ అధికారి డిక్లరేషన్‌ను తనిఖీ చేయాలి
- ఈ తనిఖీలో డిక్లరేషన్ లేకపోయినా, డిక్లరేషన్ అటెస్ట్ చేయబడనట్లయిన, అటెస్టింగ్ అధికారి సీల్ లేకపోయినా లేదా వారి హోదా చేతితో అయినా రాసిలేకపోయినా, కవర్ మీద రాసిన పోస్టల్ బ్యాలెట్ సీరియల్ నెంబరు, డిక్లరేషన్ మీద రాసిన సీరియల్ నెంబరు ఒకటి కాకపోయినా కౌంటింగ్ సూపర్ వైజర్ లేదా అసిస్టెంట్ లోపల కవరులో వున్న పోస్టల్ బ్యాలెట్ పేపర్‌ను తెరవకుండా తిరస్కరించాలని తెలిపారు.

శిక్షణలో తహశీల్దార్లు ఆనందరావు, శ్రీనివాసరావు, ఎంపిడిఒ జావేద్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్లు జగదీశ్, రామకృష్ణ, గౌరీశంకర్, నాగేశ్వరరావు, సంతోష్,శంకర రావు, సింహాచలం పాల్గొన్నారు.

పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

విజయనగరం : ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 1వ తేదీన పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు ఎపి కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ సరిత తెలిపారు. 5వ తరగతి నుంచి 7వ తరగతి వరకు ఒక విభాగం, 8 నుంచి 10వ తరగతి వరకు మరో విభాగం చొప్పున తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో పోటీలను గురజాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తామని తెలిపారు.

మెజార్టీలపైనే పందేలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్



విజయనగరంలో ఎన్నికలపై పందేల జోరు పతాక స్థాయికి చేరుకుంది. సార్వత్రిక ఎన్నికల బరిలో నిలిచిన వైసిపి, టిడిపి అభ్యర్థులు సాధించే మెజార్టీలపై బెట్టింగులు పెద్దఎత్తున నడుస్తున్నాయి. నియోజకవర్గం పరిధిలోని వార్డులు, గ్రామాలు, పంచాయతీలు, పోలింగ్ బూత్‌ల ఆధారంగా ఏ పార్టీకి ఎంత మెజార్టీ వస్తుందో వివరాలు సేకరించి, దాని ఆధా రంగా బెట్టింగులకు పాల్పడు తున్నారు. నియోజక వర్గంలోని విజయనగరంలో 50 డివిజన్లు, మండలం లో 22 పంచాయతీల పరిధిలో మొత్తం 260 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సార్వత్రిక ఎన్నికలు నువ్వా నేనా అనే రీతిలో సాగిన నేపథ్యంలో ఎవరి మెజార్టీ ఎంత అనే అంశంపై నాయకులు గణాంకాల సేకరణపై దృష్టి సారించారు. ఏ వార్డుల్లో, ఏగ్రామంలో ఎవరికి ఎంత, పంచాయతీల్లో ఎవరిది మెజార్టీ, పోలింగ్ బూత్‌ల ఆధిక్యం ఎంత, ఎవరికి మెజార్టీ ఎంత అనే అంచనాల ఆధారంగా మెజార్టీలను గణించే పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి సందిగ్ధ పరిస్థితుల్లో బెట్టింగురాయుళ్లు చెలరేగిపోతున్నారు. అయితే జూన్ ఒకటి నుంచి మరో రకమైన పోటీ నెలకొనే పరిస్థితి కనిపిస్తోంది. ప్రధాన రాజకీయ పార్టీలు వైసిపి, టిడిపి అభ్యర్థుల అసెంబ్లీ, పార్లమెంట్ స్థానంలో గెలుపు అవకాశాలపై పందేల జోరు కొనసాగుతోంది. పార్లమెంట్ పరిధిలోని ఆరు నియోజకవర్గాల్లో ఎక్కడ ఎంత మెజార్టీ లభించే అవకాశం ఉందనే అంచనాల బేరీజు వేసుకుని పందేలు కాస్తుండడం గమనార్హం. రూ. లక్ష మెజార్టీకి రూ. లక్షన్నర నుంచి రూ. మూడు లక్షల వరకు ఇస్తామనే పద్ధతిలో బెట్టింగు లు సాగు తుండడం గమ నార్హం. నియో జక వర్గంలో ఫలానా పోలింగ్ బూత్ లో కూటమికి మెజార్టీ, ఫలానా పోలింగ్ బూత్‌లో వైసిపికి మెజార్టీ వస్తుందనే అంచనాలతో పందేలకు పాల్పడు తున్నారు. ఇలా నియోజక వర్గంలో రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు పందేల జోరు కొనసాగుతోంది. మధ్యవర్తుల సహకారంతో ప్రామిసరీ బాండ్లు రాయించుకునే పరిస్థితి కనిపిస్తోంది. ఈనెల 13న పోలింగ్ జరిగిన సంగతి తెలిసిందే. జూన్ నాలుగున కౌంటింగ్ జరుగనుంది. పోలింగ్ నుంచి కౌంటింగ్ వరకు 20 రోజుల వ్యవధిలో భారీ ఎత్తున బెట్టింగులకు పాల్పడుతున్నారు.

మూడు రోజుల పాటు గ్రామాల్లో

ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో వచ్చే మూడు రోజులు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. జిల్లాలో దోమల వ్యాప్తి నివారణకు విధిగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని ఆయన ఆదేశించారు. దోమల వ్యాప్తి నివారణలో భాగంగా లార్వా వ్యాప్తి జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం డిపిఒ, ఎంపిడిఒ, జిల్లా మలేరియా అధికారికి ఆదేశాలు జారీ చేశారు. మలేరియా అధికారి సమన్వయంతో దోమల నివారణ మందులు వినియోగించి దోమల వ్యాప్తి జరగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాలపై దృష్టి సారించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండరాదని పేర్కొన్నారు. దోమల నివారణలో భాగంగా ఆయిల్ బాల్ లు, ఇతర కీటకనాశని పదార్థాలు ఉపయోగించాలన్నారు. తాగునీటి సరఫరా పైపుల పరిస్థితి తనిఖీ చేయాలని, తాగు నీరు కలుషితం కాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. తుప్పలు తొలగించాలని, బ్లీచింగ్ వేయాలని, అన్ని ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. ఎవరూ బహిరంగ మలవిసర్జన చేయకుండా గ్రామ స్థాయిలో చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అందరూ మరుగుదొడ్లు వినియోగించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని స్పష్టం చేశారు. దోమల నివారణ చర్యలకు అత్యంత ప్రాధాన్యతివ్వాలన్నారు. ఎక్కడా ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని, ప్రజారోగ్యానికి ఇది అత్యావశ్యమని చెప్పారు. కాలువల్లో పూడికలు తొలగించడం, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. బావులు, కుళాయిలు, బోరుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఇకపై వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఇప్పటి నుంచే మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రభలకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ మండలాల్లో వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. యాంటి లార్వా స్ప్రేయింగ్‌ను టికెజమ్ము గ్రామ పంచాయతీలో టికెజమ్ము, పెడదోడజ, గోర్లి, గోర్లివలస తదితర గ్రామాల్లోనూ, మావుడి గ్రామపంచాయతీ పరిధిలోని మధుర పురిగానివలసలో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టారు. తాగు నీటి బావులలో క్లోరినేషన్ చేపట్టారు. పూడికలు తొలగించడం వంటి కార్యక్రమాలను చేపట్టి, దోమల వ్యాప్తి నివారణ చర్యలు తీసుకున్నారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, మండల పరిషత్ అభివద్ధి అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, పంచాయతీ, మలేరియా సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



టికెజమ్ములో యాంటి లార్వా స్ప్రేయింగ్ చేయిస్తున్న వైద్యసిబ్బంది

బేషరతుగా లాకౌట్ ఎత్తివేయాలి

- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ
- యాజమాన్యంతో చర్చలు మరోసారి విఫలం

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ యాజమాన్యం బేషరతుగా లాకౌట్ ఎత్తివేసి కార్మికులం దరికీ పని కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ డిమాండ్ చేశారు. జిందాల్ కంపెనీ వద్ద కార్మికులు చేస్తున్న నిరసన బుధవారం నాటికి 11వ రోజుకు చేరింది. ముందుగా కార్మికసంఘాల నాయకులు, కార్మికులు యాజమాన్యంతో చర్చలు జరిపారు. ఈ చర్చలో యాజమాన్యం తరపున కంపెనీ జిఎం దినేష్ శర్మ, కంపెనీ జిఎం సుంకలాల్, హెచ్ఆర్ డిజిఎం గోపాల్ కృష్ణ, పాల్గొనగా, కార్మికుల తరపున సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేవుడు, నిమ్మలపాలెం సర్పంచ్, కార్మిక నాయకులు నమ్మి చినబాబు, పిల్ల అప్పలరాజు, లగుడు వామాలు, పెదరెడ్ల ప్రసాదు చర్చల్లో పాల్గొన్నారు. ఇక్కడ పరిశ్రమను తెరిచే అవకాశం లేనందున కార్మికులు ఒడిశా రాష్ట్రం జాజిపూర్ వెళ్లాల్సిందేనని యాజ మాన్య ప్రతినిధులు చెప్పారు. కార్మికులకు పని కల్పించడం తమ చేతిలో లేదని, జిందాల్‌టాప్ మేనేజ్మెంట్ చేతిలో ఉందని తెగేసి చెప్పారు. దీంతో చర్చలు విఫలమై కార్మిక సంఘాల నాయకులు వెను తిరిగారు. అనంతరం కార్మికులను ఉద్దేశించి తమ్మినేని మాట్లాడుతూ కార్మికు లకు పోరాటమే మార్గమని అన్నారు. యాజమాన్యం దిగి వచ్చేంత వరకు పోరాటం ఆగదని అన్నారు. ఇప్పటికే చాలామంది కార్మికులు రిటైర్మెంట్ స్టేజ్ దగ్గరలో ఉన్నారని, యాజమాన్యం కార్మికుల ఉసురు పోసుకుంటున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం దిగివచ్చి బేషరతుగా పరిశ్రమను తెరిపించి కార్మికులకు పని కనిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఇందు కూరి రఘురాజు మాట్లాడుతూ జిందాల్ యూనిట్ పెద్దలతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. జిందాల్ యాజమాన్యం కార్మికులను రోడ్డుపై నెట్టిందని, ముందస్తు సమాచారం లేకుండా కంపెనీకి లే ఆఫ్ ప్రకటించడం సరికాదని అన్నారు.కంపెనీ మూసివేసి రోజులు గడుస్తున్నా యాజమాన్యం తీరులో మార్పు లేదని అన్నారు. యాజమాన్యం బేషరతుగా కంపెనీ తెరిచి, కార్మికులందరికీ పని కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, కార్మిక నాయకులు బొట్ట రాము, సలాది భీమయ్య, బాలిబోయిన ఈశ్వరరావు, పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



రమేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రమేష్ కుటుంబీకులకు సిపిఎం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పల్లెరిక రమేష్ కుటుంబ సభ్యులను కురుపాం నియోజకవర్గం సిపిఎం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ బుధవారం పరామర్శించారు. రమేష్ మృతి చెందడం అత్యంత బాధాకరమని భార్య గంగమ్మ, పిల్లలు ఓంకార్, హర్షిణి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి కోలక అవినాష్, నాయకులు బిడ్డిక సత్యం, బిడ్డిక ఆడిత్తు ఉన్నారు.

గొర్రెల మందపై కుక్కలు దాడి

ప్రజాశక్తి కొమరాడ

పంట పొలాల్లో మేపుతున్న గొర్రెల మందపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేసిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని అర్తం వలస గ్రామ సమీపంలో మండలానికి చెందిన గొర్రెల కాపరులు మందను మేపుతున్నారు. ఇదే సమయంలో బుధవారం ఉదయం గుణానపురం వైపు నుంచి ఒక్కసారిగా మూడు కుక్కలు మేకల మందపై వచ్చి దాడి చేశాయి. ఈ దాడిలో పలు మేకలకు తీవ్ర గాయాలు అయినట్లు పెంపకందారులు తెలిపారు. ఈ కుక్కలను చూస్తే ఇతర ప్రాంతాల నుంచి వచ్చినట్లు అనుమానంగా ఉందనే వారు తెలుపుతున్నారు. జియ్యమ్మవలస మండలంలో జరిగిన కుక్క దాడి ఘటన గుర్తు చేసుకుని ఒకసారిగా ప్రజలు తీవ్ర భయాందోళన పడ్డారు. ఏది ఏమైనా కొమరాడ మండలంలోని ప్రజలు కుక్కల పట్ల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని పలువూరు అంటున్నారు.



బస్సుల కోసం నిరీక్షిస్తున్న విద్యార్థులు

ప్రయాణికులకు తప్పని పాట్లు

ప్రజాశక్తి - మక్కువ

మండల కేంద్రంలోని బస్ స్టాప్ ప్రదేశంలో షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు నానా అవస్థలుపడుతున్నారు. తీవ్రమైన ఎండలైనా, వానలైనా బస్సు కోసం ఆరుబయటే నిరీక్షించాల్సిన పరిస్థితి ప్రయాణికులకు తప్పడం లేదు. ఏళ్ల తరబడి నిరుపయోగంగా పడి ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ ఏ రోజు ప్రయాణికులకు ఉపయోగపడిన దాఖలాల్లేకపోవడంతో అది పూర్తిగా పాడైపోయింది. ప్రధాన కేంద్రంలో బస్ షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు దుకాణాల అంచున నిలబడి బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి కనీసం బస్సు షెల్టర్ నిర్మాణం అయినా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్

సీతారాంపురంలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని సీతారాంపురంలో ఫ్యామిలీ డాక్టరు వైద్య సేవలు డాక్టర్ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వైద్య సేవలో 70 ఏళ్ల వయోవృద్ధుడికి కాళ్లు విరిగిన రోగికి తనిఖీలు చేసి, అతడికి కావాల్సిన మందులు ఇంచారు. డ్రెస్సింగ్, ఇతర వైద్య నిమిత్తం పిహెచ్‌సికి రావాలని సూచించారు. ఈ వైద్య శిబిరానికి గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులు, బాలింతలు, 60ఏళ్లపైబడిన వారు రావడం, వారికి అవసరమైన రక్త పరీక్షలు చేసి, మందులు ఇస్తూ ఆరోగ్య సూచనలు చేశారు. వ్యాధులు సోకకుండా ఆహార అలవాట్లులో కొన్ని జాగ్రత్త పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, అనిత, మాలతి, రామకృష్ణ, 104 సిబ్బంది దుర్గాప్రసాద్, శంకరావు, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

సంతకాలతో సమావేశం సరి

ప్రజాశక్తి - సీతంపేట

మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపిపి బి.ఆదినారాయణ అధ్యక్షతన బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగింది. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎటువంటి కొత్త తీర్మానాలు చేయలేదు. ప్రతి మూడు నెలలకు సమావేశం నిర్వహించాలని కనుక ఏర్పాటు చేశారు. అనంతరం సంతకాలు సేకరించి సమావేశం మామా అనిపించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ కె.గీతాంజలి, ఇఒపిఆర్‌డి కె.సత్యం, ఎడి శ్రీనివాసరావు, డిఇ కృష్ణకుమార్, ఎపిఒ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని అడ్డాపుశిలలో ఎన్నారై సుధీర్ మోహన్ పట్టా ఏర్పాటు చేసిన ఉపాధి శిక్షణ కేంద్రంలో బుధవారం కేంద్ర నిర్వాహకుడు అక్కేన సుందరనాయుడు ఆధ్వర్యంలో కుట్టు పనిలో శిక్షణ పొందిన 30 మంది యువతులకు ధ్రువపత్రాలు పంపిణీ చేశారు. ఆగ్రామ సర్పంచి రామకృష్ణ చేతుల మీదుగా ఐదుగురు పేద మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్ అందజేస్తున్న సర్పంచ్ రామకృష్ణ

సమస్యలుంటే చెప్పండి : డిఇఒ

ప్రజాశక్తి - వీరఘట్టం

ఏమైనా సమస్యలుంటే చెప్పాలని డిఇఒ జి.పగడాలమ్మ మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సూచించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వంట ఏజెన్సీల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే మీ సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని డిఇఒ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలలకు చెందిన కొంతమంది వంట వంట ఏజెన్సీలు అదనంగా గ్యాస్ సరఫరా చేయాలని, ప్రస్తుత ఇస్తున్న పారితోషకం చాలదని, వాటిని కూడా పెంచాలని వంట ఏజెన్సీలు డిఇఒ వద్ద విన్నవించుకున్నారు. చాలా కాలంగా పాఠశాలల వద్ద వంట ఏజెన్సీలుగా పని చేస్తున్నామని, శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మీరు చక్కగా వండాలని, మీ పిల్లల వలె వందలాది మంది పిల్లలకు వంటలు చేస్తూ భోజనాలు పెడుతున్నందుకు అభినందనలు తెలిపారు. పాఠశాలలో వంటలు ఏ విధంగా చేయాలో ప్రాజెక్టు ద్వారా వంట ఏజెన్సీలకు వివరించారు. కార్యక్రమంలో ఎండిఎం ఎడి కె.దామోదరరావు, సిసిహెచ్ వై.శాంతకుమారి, సిఆర్‌పిలు జగదీష్, వెంకటలక్ష్మి, సంగయ్య, దుర్గారావు, సింహాచలం, జ్యోతి, ఎంఆర్‌సి సిబ్బంది వాసు, సురేష్, తదితరులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఇఒ పగడాలమ్మ

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో బడి ఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలని కార్మికశాఖ జిల్లా ఇన్ ఛార్జ్ అధికారి, సహాయ కమిషనర్ కె.రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర కార్మికశాఖ కమిషనర్ వారి ఆదేశాల మేరకు కార్మికశాఖ, ఇతర ప్రభుత్వశాఖలు సంయుక్తంగా జిల్లాలో జూన్ 1 నుంచి 30 వరకు చైల్డ్ లేబర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. 14ఏళ్ల వయస్సు లోబడిన పిల్లలు షాప్‌లు, సంస్థలు, వాణిజ్య సంస్థలు, హెూటళ్లు, సినిమా హాలులో, మెకానిక్ షెడ్‌లు, రెడీ మేడ్ దుకాణాలు, కిరాణా షాప్‌లు, డిపార్ట్మెంట్స్ స్టోర్‌లు, వెల్డింగ్ షాప్‌లు, తోపుడు బండ్లు, మోటార్ రవాణా వంటి ప్రమాదరహిత ప్రదేశాల్లో పని చేయరాదని, ప్రమాదకరమైన ప్రదేశాల్లో 18ఏళ్లలోపు బాల బాలికలను పనిలో పెట్టుకోకూడదని తెలిపారు. కార్మికశాఖ చట్టాలకు వ్యతిరేకంగా ఎక్కడైనా బాలబాలికలు పనిచేస్తున్నట్లు అధికారులు గుర్తిస్తే అందుకు కారణమైన సదరు యాజమాన్యం పై బాల కార్మికుల చట్టం-1986 అనుసరించి తగుచర్య తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు మరమ్మతులు చేయండి

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి కోనేరు వరకు గల అంతర్రాష్ట్ర రహదారిని బాగు చేసి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న ఈశ్వరుని ఆలయం వద్ద అంతరాష్ట్ర రహదారిపై గోతిలో బుధవారం లారీ దిగిపోయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం నుంచి కొమరాడ మీదగా మూడు రాష్ట్రాలకు వెళ్లే కు రహదారి మార్గంలో కోటిపాం-కొమరాడ, బంగారంపేట - ఇందిరా నగరం, చోళపదం ఈశ్వరుని ఆలయం వద్ద అటు ఒడిశా, ఇటు ఆంధ్ర సరిహద్దు కూనేరు వద్ద ఉన్న గోతులను కప్పి అటు ప్రయాణికులను, ఇటు వాహనదారుల ప్రాణాలు కాపాడాలని కోరారు. ఈ గోతులను జూన్ 10లోగా కప్పకపోతే ఆ తర్వాత పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

వెంకటరాయుడుపేటలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

మండలంలోని వెంకటరాయుడుపేటలో బుధవారం బందలుప్పి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కౌశిక్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 87 మందికి వైద్య సేవలందించినట్లు ఆయన తెలిపారు. గ్రామంలో ముందుగా మంచానపడి ఉన్న వృద్ధులు, గర్భిణీలు, బాలింతల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య సేవలు అందించామన్నారు. గ్రామంలో ఉచితంగా రక్తపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించినట్లు తెలిపారు.

పలు గ్రామాల్లో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేట, బగ్గందొరవలస, చెల్లంనాయుడువలస, పెదభోగిలిలో ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్ని గ్రామపంచాయతీలో కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. దోమల వ్యాప్తి నివారణకు విధిగా అన్ని గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించాలని ఆదేశించారు. దోమల వ్యాప్తి నివారణలో భాగంగా లార్వా వ్యాప్తి జరగకుండా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. మలేరియా అధికారి సమన్వయంతో దోమల నివారణ మందులు వినియోగించి దోమల వ్యాప్తి జరగకుండా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. నీరు నిల్వ ఉండే ప్రదేశాలపై దృష్టి సారించాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండరాదని పేర్కొన్నారు. దోమల నివారణలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీటి సరఫరా పైపుల పరిస్థితి తనిఖీ చేయాలని, తాగు నీరు కలుషితం కాకుండా చూడాలని ఆయన ఆదేశించారు. తుప్పలు తొలగించాలని, బ్లీచింగ్ వేయాలని, అన్ని ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. ఎవరూ బహిరంగ మలవిసర్జన చేయకుండా గ్రామ స్థాయిలో చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అందరూ మరుగుదొడ్లు వినియోగించేలా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ యుద్ధప్రాతిపదికన నిర్వహించాలని ఆయన స్పష్టం చేశారు. దోమల నివారణ చర్యలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన అన్నారు. ఎక్కడా ఎటువంటి నిర్లక్ష్యం ఉండరాదని, ప్రజారోగ్యానికి ఇది అత్యవసరమని చెప్పారు. కాలువల్లో పూడికలు తొలగించడం, ముఖ్యంగా ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. బావులు, కుళాయిలు, బోరుల వద్ద మురుగు నీరు నిల్వ ఉండకుండా శ్రద్ధ వహించాలన్నారు.



అంటిపేటలో కాలువల్లో పూడికలు తీయిస్తున్న ఎంపిడిఒ ఈశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్నఎడిఎ నిర్మల జ్యోతి

గడ్డిపత్తిపై అవగాహన

ప్రజాశక్తి - కొమరాడ

గడ్డి పత్తి సాగుపై అవగాహన అవసరమనివ్యవసాయ సహాయక సంచాలకులు ఎ.నిర్మల జ్యోతి అన్నారు. బుధవారం గడ్డి పత్తిపై అవగాహన సదస్సును మండలంలోని మాదలింగి రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ఆమె రైతులను ఉద్దేశించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. గడ్డిపత్తి వల్ల భూమి నిశ్శారావంతంగా తయారవుతుందని, ఇది కేన్సర్ కారకమవుతుందని చెప్పారు. కావున మానవాళికి కేన్సర్ వస్తుందనీ హైబ్రిడ్ పత్తి కన్నా దిగుబడి చాలా తక్కువగా వస్తుందన్నారు. ఈ పత్తి సాగుచేసిన రైతులకు ఈ క్రాపింగ్ కూడా చేయమని, దీంతో రైతులు ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని పథకాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. పంట నష్టం, బీమా రాదన్నారు. కావున అందరు రైతులు ఈ గడ్డి పత్తిని నిరోధించి, మామూలుగా హైబ్రిడ్ బిటి పత్తిని సాగు చెయ్యాలని సూచించారు. ఎక్కడైనా ఈ గడ్డి పత్తి అమ్మినట్లయితే 155251 కాల్ సెంటర్‌కు ఫోన్ చేయాలని, లేకుంటే స్థానిక వ్యవసాయ అధికారులకు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. మండలంలో వరి విత్తనాలు ముందుగానే రప్పించామన్నారు. కట్టెలు, జీలుగ పచ్చిరొట్ట విత్తనాలు ప్రతి రైతు భరోసా కేంద్రంలో పంపిణీ జరుగుతుందని రైతులకు వివరించారు. రైతు భరోసా కేంద్రం ద్వారా అంది విత్తనాలు, ఎరువులను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి పి.శంకర్రావు, సిబ్బంది రైతులు ఉన్నారు.

షాడో ఆర్ట్‌పై చిన్నారులకు అవగాహన

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిబిరంలో భాగంగా డ్రాయింగ్ మాష్టర్ జి.మురళి పిల్లలకు పగటిపూట సూర్యుడు ఎలా కదులుతాడో పిల్లలకు షాడో ఆర్ట్ ఒక అద్భుతమైన మార్గమని వివరించారు. సూర్యుని కోణం వలె తమ వస్తువు నీడ కదులుతుందని వారు చూడవచ్చు. వారు వేర్వేరు సమయాల్లో నీడలను గీసినట్లయితే, నీడలు మారడం, ఉదయం, సాయంత్రం పొడవుగా పెరగడం, మధ్యాహ్న సమయంలో తక్కువగా ఉండడం గమనించవచ్చు. పెయింటింగ్ ఎలా చేయాలో పిల్లలకు వివరంగా చెప్పారు. ఇందులో పిల్లలు చాలా మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

దేవస్థానం ఆదాయం రూ.27.36లక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానం ఆదాయం హుండీల ద్వారా రూ.27,36,578 వచ్చింది. బుధవారం దేవస్థానం ఆవరణలో పర్యవేక్షక అధికారి పివి లక్ష్మి ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు జరిగింది. ఈ లెక్కింపులో మార్చి 11నుంచి ఈ నెల 28వరకు హుండీ ల ద్వారా రూ.27.36లక్షలు వచ్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది ఇజ్జురోతు శ్రీనివాసరావు, పోలీస్ సిబ్బంది, ఐసిఐసి బ్యాంకు విజయనగరం సిబ్బంది, శ్రీవారి సేవ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఐదు రోజులైనా అధికారులకు పట్టలే !

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని 27వ వార్డు ప్రాంతానికి ఆనుకుని ఉన్న ప్రధాన కాలువలో చెత్తలు, వ్యర్థాలు పేరుకుపోవడంతో మురుగునీరు కాలువ పలకలపై నుంచి పొంగి రహదారిపైనే ఐదు రోజులుగా మురుగు నీరు రోడ్లపైన ప్రవహిస్తున్నప్పటికీ మున్సిపల్ ప్రజారోగ్య విభాగం అధికారులు గానీ, వార్డు సచివాలయ పరిధిలోని శానిటరీ కార్యదర్శి గానీ మురుగునీరు వెళ్లేందుకు చర్యలు తీసుకోకపోవడంతో ప్రధాన రహదారి గుండా రాకపోకలు సాగించే పాదచారులు, వాహన చోదకులు అధికారుల తీరుపై బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ సమస్య పరిష్కారానికి అటు పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు గానీ ఇటు మునిసిపల్ ఇంజనీరింగ్ అధికారులు గానీ స్పందించకపోవడం పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ప్రజా ఆరోగ్య అధికారి సిహెచ్.మురళి వద్ద ప్రస్తావించగా, మున్సిపల్ జెసిబి మరమ్మతుకు గురైందని, రెండు, మూడు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతామని తెలపడం గమనార్హం.



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు



ఒకే చోటకు చేరిన పూర్వవిద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - సాలూరు

స్థానిక ఆర్‌సిఎం సెయింట్ థెరిస్సా హైస్కూల్‌లో బుధవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 1996 నుంచి 2006 వరకు పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు సమావేశమై గత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఒకరినొకరు పలుకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ బేబీ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తర్వాత ఉపాధ్యాయులు కృష్ణారావు పాఠశాల చరిత్ర వివరించారు. వివిధ ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడిన వారు 18 ఏళ్ల తర్వాత కలుసుకుని సరికొత్త అనుభూతిని పొందారు.

అలమండ సంత అక్రమ లైసెన్సుపై విచారణ

ప్రజాశక్తి - జామి

మండలంలోని లోట్లపల్లి పంచాయతీ అలమండ పశువులు సంతకు అక్రమంగా లైసెన్స్ మంజూరు చేశారన్న దానిపై వచ్చిన ఫిర్యాదుపై బుధవారం విచారణ జరిగింది. ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య జాయింట్ డైరెక్టర్ పశుసంవర్ధశాఖకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వారిపై విచారణకు గంట్యాడ పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రెడ్డి కృష్ణ హాజరయ్యారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన, విచారణ సందర్భంగా హాజరైన కమిటీ సభ్యులందరి నుంచి రాత పూర్వకంగా స్టేట్మెంట్ ఇవ్వాలని సభ్యులకు సూచించారు. ఈ సందర్భంగా ఫిర్యాదు దారు రాష్ట్ర గో సంరక్షణ సమైక్య కమిటీ సభ్యులు చోళ్ల రాజకుమారి మాట్లాడుతూ జీవో నెంబర్-23, రాష్ట్ర హై కోర్టు ఆదేశాలు మేరకు పశువులు సంతల్లో సీసీ కెమెరాలు, ర్యాంపులు, మంచినీటి కుండీలు, షెడ్లు, గడ్డి, దాణా, ఇన్-అవుట్ గేట్, రిజిస్టర్, అన్నీ సదుపాయాలు కల్పించిన మీదటనే లైసెన్స్ మంజూరు చేయాలసి ఉండగా, అధికారులు లైసెన్స్ మంజూరు చేయడం దారుణమన్నారు. ఈ విషయమై విచారణ జరిపి అధికారులుపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విచారణకు అలమండ పశు వైద్యులు డాక్టర్ నరేష్, జామి పశు వైద్యులు డాక్టర్ 'అప్పలనాయుడు, జామి మండల విస్తరణ అధికారి శ్రీదేవి, వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఐశ్వర్య లక్ష్మి, లోట్లపల్లి సెక్రటరి రొంగళి ఎర్నమ్మ, అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ సిబ్బంది ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, డివిజనల్ జంతు సంక్షేమ కమిటీ సభ్యులు చీడి రామకృష్ణ, నీలాపు దేవి తదితరులు పాల్గొన్నారు.

ఎస్.కోటలో క్రాస్ ఓటింగ్ భయం

ఫలితాల కోసం ఎదురు చూపులు
గెలుపు ధీమాల పై ఉత్కంఠ

ప్రజాశక్తి - జామి

శృంగవరపుకోటకు క్రాస్ ఓటింగ్ భయం పట్టుకుంది. ఎన్నికల ఫలితాలపై క్రాస్ ఓటింగ్ ప్రభావం తీవ్రంగా ఉంటుందని అధికార, ప్రతిపక్ష పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. క్రాస్ ఓట్లు ఎవరి? కొంప ముంచితాయో అని ఇరు పార్టీలో కలవరం మొదలైంది. కానీ బయటకు మాత్రం మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్న పరిస్థితి. ఈ నేపథ్యంలోనే వచ్చే ఒకటో తేదీన విడుదల కానున్న ఎగ్జిట్ పోల్స్‌పై కొంత క్లారిటీ వస్తుందని బావిస్తున్నారు. మొత్తానికి ఎన్నికల ఫలితాలు ఇరు పార్టీ నాయకులు, కార్యకర్తలను కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది అనడంలో ఎటువంటి సందేహం లేదనే చెప్పక తప్పదు. వివరాల్లోకి వెళితే..

రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి, ఎన్‌డిఎ కూటమి మధ్య హోరా హోరీ పోటీ ఉందని ప్రచారం జరుగుతోంది. కానీ ఎస్.కోట నియోజకవర్గంలో భిన్నమైన పరిస్థితి నెలకొంది. ప్రధానంగా వైసిపి నుంచి ఎమ్మెల్సీ స్థాయిలో ఉన్న వ్యక్తి టిడిపికి పని చేయడం, ఏ మేరకు ప్రభావం ఉంటుందో అన్న చర్చ సాగుతోంది. మరో వైపు ఎమ్మెల్సీ భార్య పార్టీ వీడినప్పటికీ రఘురాజు కేడర్ పూర్తి స్థాయిలో పార్టీ వీడలేదు. వీరంతా బొత్స కుటుంబాన్ని అభిమానించే వారు, కావడంతో బొత్స ఫ్యాన్సీకి ఓటు ఖాయం అన్నది స్పష్టం. అయితే ఇలాంటి వారు క్రాస్ ఓటింగుకు పాల్పడే అవకాశం లేకపోలేదు. కానీ ఎన్నడూ లేని విదంగా ఎస్.కోట అసెంబ్లీ బరిలో తొలిసారీ బొత్స మార్కు రాజకీయంతో ఆ పొరపాటు జరగనీయరన్న ధీమా వైసిపి కేడర్‌లో కనిపిస్తుంది. అందులో భాగంగానే వార్డు స్థాయి మొదలు కొని నియోజకవర్గ స్థాయి నాయకుల వరకూ బొత్స నేరుగా మాట్లాడి, రంగంలోకి దింపిన పరిస్థితి ఉందని అధికార పార్టీ బావిస్తుంది. ఇక టిడిపి విషయానికొస్తే, కోట తెలుగుదేశానికి కంచుకోట. గొంప కృష్ణ రాజకీయ అరగేట్రంతో టిడిపి బలం కుడా పుంజుకుంది. దీనికి తోడు ప్రభుత్వ వ్యతిరేక ఓటుతో ఈ సారీ గెలుపుతథ్యం అని తెలుగు తమ్ముళ్లు బావిస్తున్నారు. కానీ గొంప వర్గంగా ఉన్న నాయకులు, కార్యకర్తలు ఎంపి అభ్యర్థి భరత్‌కు ఓటు పక్కా అయినప్పటికీ, ఎమ్మెల్యే ఓటు విషయంలో క్రాస్ ఓటింగు పడే అవకాశం ఉందన్న ఆరోపనులు వినిపిస్తున్నాయి. మొత్తానికి ఇరు పార్టీలకు క్రాస్ ఓటింగ్ బెడద ఉందని సర్వత్రా చర్చ సాగుతోంది. ఎవరు గెలిచినా, తక్కువ మెజారిటీతో గెలుస్తారన్న నేపథ్యంలో క్రాస్ ఓటింగ్ గెలుపోటములపై ప్రభావం ఉంటుందని వి శ్లేషకులు అంచనా.

ఎగ్జిట్ పోల్స్ సర్వేల కోసం ఎదురు చూపులు

ఎవరికీ వారు గెలుపు ధీమాలు వ్యక్తం చేయడంతో, ఇరు పార్టీ కేడర్లలో అయోమయం నెలకొంది. ఈ నేపథ్యంలోనే శనివారం ఉదయాన్నే విడుదల అయ్యే ఎగ్జిట్ పోల్స్ సర్వే కోసం జనం ఆశకస్తిగా చూస్తున్నారు. లేని యెడల నాలుగో తేదీ కౌంటింగ్ ఫలితాలే శిరోధార్యం మరి.

నేరాలు ఘోరాలు

చెట్టుపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - వీరఘట్టం



మండలంలోని కంబరకు చెందిన రెడ్డి మహేష్ (34) బుధవారం మామిడి చెట్టుపై నుంచి జారిపడి అక్కడికక్కడ మృతి చెందాడు. ప్రమాదం తెలిసిన వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన సంఘటనపై ఆరా తీశారు. ఈ మేరకు మృతుని భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహేష్‌కు భార్యతో పాటు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వారణాసి రైల్వే స్టేషన్‌లో చైన్ స్నాచింగ్

బంగారాన్ని పోగొట్టుకున్న బొబ్బిలి వాసి

బొబ్బిలి : వారణాసి రైల్వే స్టేషన్‌లో జరిగిన చైన్ స్నాచింగ్‌లో బొబ్బిలి పట్టణానికి చెందిన గొట్టాపు త్రినాథరావు భార్య భవాని బంగారాన్ని పోగొట్టుకున్నారు. త్రినాథరావు కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 14న కాశీ వెళ్లారు. కాశీ నుంచి ఈనెల 18న తిరుగు ప్రయాణం అయ్యారు. 14న వారణాసి రైల్వే స్టేషన్‌లో ఉదయం 9గంటల సమయంలో రైలు కోసం ప్లాట్‌ఫాంపై వేచి చూస్తుండగా ముగ్గురు గుర్తు తెలియని మహిళలు ప్రయాణికులు లాగా ఉండి భవాని మెడలో ఉన్న 68 గ్రాముల బంగారు నగలను కట్టర్‌తో కట్ చేసి దోచుకున్నారు. కొన్ని నిమిషాలు తర్వాత మెడలో బంగారు నగలు లేకపోవడంతో రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశామని భవాని, భర్త త్రినాథరావు చెప్పారు. సీసీ ఫుటేజీ ఆధారంగా చైన్ స్నాచింగ్ చేసిన ముగ్గురు మహిళలను రైల్వే పోలీసులు అరెస్టు చేశారన్నారు. చోరీ చేసిన బంగారు నగలను వేరే వ్యక్తి ద్వారా తరలించారని, ఇప్పటికీ తమకు ఇవ్వలేదని భార్య, భర్తలు వాపోయారు. రైల్వే పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి బంగారాన్ని రికవరీ చేసి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.